క్లుప్తంగా

రోడ్లపై గోతులు పూడ్చేందుకు చర్యలు



గోతులను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఏఈ రామ్మోహనరావు

సీతానగరం: అకాల వర్షాల కారణంగా మండలంలోని రోడ్లు గోతులమయం కావడంతో వాటికి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ రామ్మోహనరావు తెలిపారు. మండలకేంద్రంలోని మార్కెట్‌లో బీటీరోడ్డుకు పడిన గోతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పలుగ్రామాల్లో గ్రావెల్, మెటల్ రోడ్లను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి ఎం.విశ్వేశ్వరరావు,యు సురేష్, ఏవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెన్షనర్ల భవనంలో ఈకేవైసీ శిబిరం

పార్వతీపురం టౌన్: స్థానిక పెన్షనర్ల భవనంలో ఈకేవైసీ శిబిరాన్ని పెన్షనర్ల అసోసియేషన్ సెక్రటరీ డి.గణపతిరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం సబ్‌ట్రెజరీ పరిధిలో గల పెన్షనర్లు ఈ నెల 2వ తేదీ నుంచి 9వ తేదీవరకు ఉదయం 11 గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు ఈకేవైసీ చేయడానికి ట్రెజరీ సిబ్బంది అంగీకరించడం అభినందనీయమన్నారు. పార్వతీపురం సబ్‌డివిజన్ పరిధిలో ఈ-కేవైసీ కాని పెన్షనర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, ఆధార్‌కార్డుకు లింక్‌అయిన ఫోన్, సీఎఫ్‌ఎంఎస్ నంబర్/పీపీఓ నంబర్ తీసుకుని పెన్షనర్ల భవనానికి రావాలని కోరారు.

జోగింపేటలో పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని జోగింపేటలో సర్పంచ్ కె.సింహాచలం ఆధ్వర్యంలో కార్యదర్శి కిరణ్‌కుమార్ వేతనదారులతో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సింహాచలం, కార్యదర్శి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే వారం జరగనున్న అమ్మవారి జాతర సందర్భంగా గ్రామ ప్రజలు, జతరలో పాల్గొనే వారికి అవసరమైన తాగునీటి సౌకర్యం కల్పించడం, పారిశుద్ధ్యపనులు నిర్వహించడం, విద్యుద్దీకరణ పనులు, మంచినీటి కోనేరు శుద్ధి చేపట్టినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన రహదారి జంక్షన్ నుంచి కిలోమీటరు పొడవునా ఉన్న బీటీ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోతున్న చెత్తకుప్పలను తొలగించామన్నారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని సుబ్బమ్మ పేరంటాలు చెరువు గట్టును శుద్ధి చేసినట్లు చెప్పారు.

మహిళా సంఘాల వివరాలు నమోదు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

పార్వతీపురం టౌన్: మహిళా సంఘాల వివరాలు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో వెలుగు సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల డేటా గతంలో రాష్ట్ర సర్వర్‌లో ఉండేదన్నారు. ఇప్పుడు దానికి భిన్నంగా ఎస్‌ఆర్‌ఎల్‌ఎం పథకంలో భాగంగా సెంట్రల్ సర్వర్‌లో ఆన్‌లైన్ చేయాల్సి ఉందని తప్పులు లేకుండా సంఘాల వివరాలు సిబ్బంది నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం జయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

5న వాహనాల వేలం

సీతానగరం: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను యజమానులు ఇంతవరకూ విడిపించక పోవడంతో ఆయా వాహనాలను ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ నెల5వ తేదీన సీతానగరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎస్సై కె.నీలకంఠం ఒక ప్రకటనలో మంగళవారం తెలియజేశారు. వివిధ రకాల కేసుల్లో రిజిస్టర్ అయినప్పటికీ వాహన యజమానులు కోర్టు ద్వారా విడిపించక పోవడం వల్ల వాహనాలను బహిరంగ వేలం వేయడానికి అనుమతి వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు టీవీఎస్, స్టార్‌సిటీ మోటార్ సైకిల్, బజాజ్ ఆటో వేలం వేయనున్నామని ఔత్సాహికులు నిబంధనలను అనుసరించి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

నియామకపత్రాలు అందజేత

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ ఆదర్శ రెసిడెన్షియల్ పాలిటెక్నికల్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన పలువురు విద్యార్థులకు మంగళవారం నియామకపత్రాలు అందజేశారు. జాబ్‌లు పొందిన వారిని ఆదర్శంగా తీసుకుని, మిగతా విద్యార్థులు కూడా ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ ఆకాంక్షించారు.

జగనన్నను ఆశీర్వదించండి

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: గిరిజనులకు అండగా నిలుస్తూ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలిచి ఆశీర్వదించాలని ఉపముఖ్యమంత్రి గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో మంగళవారం పట్టుచెన్నేరు, పగులుచిన్నేరు పంచాయతీల్లోని శిఖపరువు, డొంకలవెలగవలస, వెలగవలస, పనసవలస, కుంజిమడ,కొత్తూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి . ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేకూరిన లబ్ధిని వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. ఈ క్రమంలో వారి సమస్యలను అడగగా రహదారి సమస్య వల్ల ఇళ్ల నిర్మాణం చేసుకోలేకపోతున్నామని గ్రామస్తులు తెలపగా, రహదారి మంజూరైనప్పటికీ పనులు ఎందుకు చేపట్టడం లేదని అధికారుల వైపు రాజన్నదొర చూడగా, సంబంధిత పీఆర్‌ప్రాజెక్టు అధికారులు గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనలేదని ప్రజాప్రతినిదులు,అధికారులు రాజన్నదొరకు తెలిపారు.

పీఆర్ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

దీనిపై ఆగ్రహించిన ఆయన పనిచేయని అధికారులు తనకు వద్దని, సంబంధిత పీఆర్‌ప్రాజెక్టు డీఈ, ఏఈలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిషాంత్ కుమార్‌కు ఫోన్‌లో రాజన్నదొర ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజనులకు అండగా నిలుస్తూ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెబుతూ గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ గిరిజనులను మోసం చేయడానికి టీడీపీ నాయకులు మోసపూరిత అబద్ధపు మాటలు చెబుతూ వస్తారని వారిని నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ప్రజాప్రతినిధులు, నాయకులు దండి శ్రీనివాసరావు, చోడిపల్లి బీసు, కూనేటి కుత్తే, కాశి, సామి, బేతురు, మాలతి, బిందు, కొండపల్లి సింహాచలం, పీడిక సుదర్శనదొర, సువ్వాడ రామకృష్ణ, భరత్‌శ్రీనివాస్, రఘుపాత్రుని సాంబమూర్తి, సంగంరెడ్డి జయసింహ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి



గడపగడపకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పేర్కొన్నారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బందలుప్పి గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న ప్రభుత్వ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. వార్డుల్లో ప్రధాన సమస్యలను అడిగారు. గ్రామంలో రోడ్లు పరిశీలించి అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మాది చేతల ప్రభుత్వం

కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని ఎన్నికల హామీల్లో ఇచ్చిన నవరత్నాల వాగ్దానాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నవరత్నాల ద్వారా ఆర్థిక చేయూత ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేసే అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్యప్రచారాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. వచ్చే రెండేళ్ల కాలంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని వార్డువాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ మండల అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరలో రోడ్లు, కాలువలు మంచినీటి కుళాయిల ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, స్థానిక సర్పంచ్ యాళ్ల ప్రమీల, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, ఎంపీటీసీలు స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు ,కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు

సంతకవిటి: మండలంలోని చిన్నయ్యపేటలో బుధవారం నుంచి అభయాంజనేయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వేదపండితులు పులఖండం శ్రీధర్ శర్మ, రంప కోదండరామ శర్మల సంయుక్త ఆధ్వర్యంలో దాదాపు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా 5వ తేదీన విగ్రహానికి ప్రాణప్రతిష్ట, మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత ఉమామహేశ్వరరావు

రేగిడి: మండలంలోని లచ్చనవలస గ్రామంలో కామోదుల నారాయణరావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుని భార్య ఆదిలక్ష్మికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10 వేలను వైఎస్సార్ సీపీ నేత మీసాల ఉమామహేశ్వరావు చేతుమీదుగా మంగళవారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలను ఆమె బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.


ఘనంగా ఉమాసోమేశ్వరుల కల్యాణం



ఉమాసోమేశ్వర కల్యాణం

బాడంగి: మండల కేంద్రంలోని ఉమాసోమేశ్వరాలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతున్నాయి. గ్రామపెద్దల సమక్షంలో గ్రామస్తులు కల్యాణ మహోత్సవ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకతో జరుపుకుంటున్నారు. స్వామివారి ఉత్సవమూర్తులకు మంగళవారం ఊరేగించారు.

అయ్యప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో నూతనంగా ప్రారంభమైన వీరమణికంఠ స్వామి(పుట్టలో వెలసిన అయ్యప్పస్వామి) ఆలయాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు స్వామికి ప్రత్యేక పూజలు చేసి, రాష్ట్ర ప్రజలు బాగుండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస రామచంద్రినాయుడు, ఎంపీటీసీ పుర్లి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలోనే రోగులకు మెరుగైన వైద్యసేవలు

- డీఐఓ జగన్మోహన రావు



పెదంకలాం పీహెచ్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ టి.జగన్మోహన్‌రావు

సీతానగరం: గ్రామాల్లో రోగులకు వైద్యాధికారులు, సిబ్బంది వ్యాధి నిర్ధారణ చేసి క్షేత్రస్థాయిలోనే మెరుగైన సేవలందించాలని జిల్లా ఇమ్యునైజేషన్(డీఐఓ)అధికారి టి.జగన్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పెదంకలాంలో పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్, సీతానగరంలో పీహెచ్‌సీ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తున్నారో తెలుసుకునేందుకు టూర్ డైరీలను పరిశీలించారు. ఆశా కార్యకర్తలకు పంపిణీ చేసిన హెచ్‌బీ ఎన్‌సీ కిట్‌లను ఉపయోగించి నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, సీజనల్‌వారీగా వస్తున్న వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి ఇళ్లవద్దనే మెరుగైన వైద్యసేవలు అందించాలని స్పష్టం చేశారు. గర్భిణులను ప్రసవ సమయంలో సమీపంలోఉన్న ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పించాల,ని సూచించారు.

డ్రైడే విధిగా పాటించాలి

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందిన వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్యపర్యవేక్షణ విధిగా చేయాలన్నారు. రెండు పీహెచ్‌సీల్లో 104 సంచారవైద్య కేంద్రం ద్వారా గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను, డ్రైడే కార్యక్రమాలు విధిగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జి.సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, సత్యవతి, జయాగౌడ్, సింహాచలం, ఏఎన్‌ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనులపండువగా కామాక్షి ఆలయ వార్షికోత్సవం



పురవీధుల్లో నిర్వహిస్తున్న అమ్మవారి ఊరేగింపు

సాలూరు: పట్టణంలోని కామాక్షి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం కనులపండువగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగిస్తున్న క్రమంలో కోలాటం వంటి ప్రదర్శనలతో వీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. 8 రోజులపాటు ఈ వార్షికోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. వరుణ్‌కుమార్ వర్ధంతి సందర్భంగా నిర్వహించే ఈ పోటీలను ఎంపీపీ కుంబురుక దీనమయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, మాజీ ఎంపీటీసీ కృష్ణ, సర్పంచ్ టి.తులసమ్మ కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులంతా స్నేహపూరిత వాతావరణంలో చక్కగా ఆడి, క్రీడాస్ఫూర్తి కనబరచాలన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, వారిని ఆదర్శంగా తీసుకుని, ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అప్పలస్వామి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు ముమ్మరం చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ కె హేమలత

సీతానగరం: వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం అమలులో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే పనుల్లో ఇంతవరకూ పూర్తయిన గ్రామాల్లో రోవర్ విధానం ద్వారా గుర్తించిన ప్రాంతాల్లో సర్వే రాళ్ల ఏర్పాటు ముమ్మరం చేయాలని పార్వతీపురం ఆర్డీఓ కె.హేమలత సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆమె సీతానగరం మండలంలోని చిన్నారాయుడుపేట, నీలకంఠాపురం, పాపమ్మవలస గ్రామాల పొలాల్లో సర్వే, రెవెన్యూ అధికార సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించే 'రీ'సర్వే రాళ్ల ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడతలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్ల ఏర్పాటును మరింత వేగవంతం చేయడానికి అవసరమైన సూచనలు చేశారు. అలాగే గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఏవైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. నిర్దేశించిన గడువులోగా సర్వే రాళ్లను భూముల్లో ఏర్పాటు చేయాలని, సిబ్బంది అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వీ రమణ, రీ సర్వే డీటీ పి చిట్టెమ్మ పాల్గొన్నారు.

అర్జీలు 24 గంటల్లో పరిష్కరించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో భాగంగా వచ్చే దరఖాస్తులను మండల స్థాయిలో అధికారులు 24 గంటలలోనే పరిష్కరించాలని వచ్చిన మార్గదర్శకాలను అందరూ పాటించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం అమలుపై మండలస్థాయి అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామంనుంచైనా ఎటువంటి సమస్యతో పిటిషన్ పట్టుకువచ్చినా మాట్లాడి క్షుణ్ణంగా సమస్య తెలుసుకోవాలని సూచించారు. దూర ప్రాంతాలనుంచి సమస్యలతో మండల కార్యాలయాలకు వచ్చిన పిటిషన్‌దారు అధికారులు చెప్పిన సమాధానంతో సంతృప్తి చెందాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.అవినాష్, ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ, వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు, పోలీస్, వైద్యరోగ్యశాఖ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామానికో కోనేరు అభివృద్ధి



జోగింపేటలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: అమృత్ సరోవరంలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామంలో ఒక కోనేరును అభివృద్ధి చేయడానికి సత్వర చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఇప్పలవలస, పాపమ్మవలస గ్రామాల్లో జరుతున్న ఉపాధి పనులతో పాటు జోగింపేట గ్రామంలో కాలనీని ఆనుకుని ఉన్న చెరువును (అమృత్ సరోవరం)సుందర వనంగా తయారు చేయడానికి జరుగుతున్న పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాన్ని ఆనుకుని ఉన్న కోనేరును గుర్తించి అమృత్‌సరోవరం కోనేరుగా తయారుచేసి ప్రజలకు చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణ కల్పించి, సేదతీర్చుకునేందుకు నీడఉండే విధంగా చెట్లు, పూల మొక్కలు, ఫలజాతి మొక్కలు నాటడానికి వీలుగా పనులు చేపడతామన్నారు. భావితరాలకు ఉపయోగపడేలా పనులు జరుగుతున్నాయని తెలియ జేశారు. గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే రహదారులు, వ్యవసాయ భూములకు సాగు నీరందించే చెరువుల అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలియజేశారు. అలాగే ఉపాధి పనుల్లో పాల్గొన్న శ్రమశక్తి సంఘ సభ్యులకు గిట్టుబాటు వేతనాలు వచ్చేలా పనులు కల్పించాలని, సమయ పాలన పాటించేలా అవగాహన కల్పించాలని టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ జేఈ కృష్ణ, టెక్నికల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

వైభవంగా దాడితల్లి సిరిమానోత్సవం



సిరిమాను నుంచి ఆశీర్వచనాలు ఇస్తున్న పూజారి

- పోటెత్తిన భక్తజనం
- దర్శించుకున్న ప్రముఖులు



ఆకట్టుకున్న బళ్ల వేషాలు, విచిత్ర వేషధారణలు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ముహూర్త సమయానికి సిరిమాను రథం జై దాడితల్లి, జైజై దాడితల్లి అన్న భక్తుల నినాదాల మధ్య కదిలింది. గొల్లపల్లితో పాటు 12 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవంగా భావించే భక్తులు తమ మొక్కులు తీర్చుకుని దాడితల్లికి ప్రణమిల్లారు. గొల్లపల్లి పైల వీధిలో పూజారి బత్తిన సూరిబాబు సిరిమానును అధిరోహించారు. సిరిమానోత్సవానికి ఉత్తరాంధ్ర, ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. పైల వీధిలో సిరిమాను ప్రారంభమై భక్తుల జయజయధ్వానాల మధ్య కీడురాయి వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి దాడితల్లి కాలనీలో ఊరేగింది. అక్కడి నుంచి ప్రధానరహదారి మీదుగా పట్టణంలోకి ప్రవేశించింది.

ఆకట్టుకున్న బళ్ల వేషాలు:

సంప్రదాయ బళ్ల వేషాల అంకం గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి జాతరలో నేటికీ కొనసాగుతోంది. అందులోని కొత్త ఒరవడిని కలగలిపి బళ్ల వేషాలు పండుగకు ఏటా కొత్త రూపు తీసుకువచ్చి భక్తులకు కనువిందు చేస్తున్నాయి. వీటితో పాటు విచిత్ర వేషధారణలు, కాళిమాతల ప్రదర్శనలు అలరించాయి. ఈ సారి కొత్తగా భారీ కాయంతో ఉన్న శివ రూపుడి ప్రదర్శన ఆకట్టుకుంది.

తృటిలో తప్పిన ముప్పు

సిరిమానోత్సవ రథాన్ని పైల వీధిలో తిప్పి వెనక్కి మళ్లించినపుడు విద్యుత్ స్తంభానికి చిన్నగా రాసుకుంటూ కాసేపు ఆగింది. అంతకు ముందు కాసేపు మొరాయించింది. అనంతరం జై దాడితల్లి అంటూ భక్తుల నినాదాలతో సిరిమాను ముందుకు కదిలిపోయింది.

ప్రముఖుల దర్శనం

దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం నాడు ఏటా దర్శించుకునే ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సోదరుడు శంబంగి వేణుగోపాల నాయుడితో కలిసి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి సిరిమాను వద్ద పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు సిరిమాను వద్ద, ఆలయంలోనూ దాడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి ఆర్‌వీఎస్‌కే రంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆర్‌వీఎస్‌కేకే రంగారావులు సిరిమానోత్సవానికి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, సీఐ ఎం.నాగేశ్వరరావు, తహసీల్దార్ రాజారావు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా కార్లు, ద్విచక్ర వాహనాలను 200మీటర్ల ముందుగానే నిలిపివేశారు. అలాగే రాజాం - బొబ్బిలి మధ్యలో తిరిగే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను అప్పయ్యపేట మీదుగా మళ్లించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. దీంతో సిరిమానోత్సవం ప్రశాంతంగా సాగింది.

